Namaste Telangana

# నేడే గ్రూప్-2 నోటిఫికేషన్

- సీఎం కేసీఆర్‌తో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ భేటీ
- ఏడున్నర లక్షలు దాటనున్న మొత్తం దరఖాస్తులు
- నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షకు ఏర్పాట్లు?!
- జిల్లాల అధికారులతో కమిషన్ ఉత్తరప్రత్యుత్తరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా 1,036 కొలువుల భర్తీకి సత్వర చర్యలు చేపడుతున్న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి బుధవారం క్యాంపు కార్యాలయంలో కలుసుకొని భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు చక్రపాణి సీఎంకు తెలిపారు. మిగతా ఉద్యోగాల భర్తీపై సంబంధిత వివరాలు అందాక ప్రకటన చేస్తామని చెప్పారు. నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని సీఎం ఈ సందర్భంగా సూచించినట్టు సమాచారం. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నందుకు సీఎం కేసీఆర్ టీఎస్‌పీఎస్సీని ఈ సందర్భంగా అభినందించారని తెలిసింది. ఇదిలాఉండగా ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు కమిషన్ వర్గాలు జిల్లాస్థాయి అధికారులతో ఉత్తరప్రత్యుత్తరాలు మొదలుపెట్టాయి. గత ఏడాది 439 ఖాళీలతో విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌కు 5,64,431 దరఖాస్తులు రాగా పలు కారణాల వల్ల ఆ పరీక్ష వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీల వివరాలను మదింపు చేసి కొత్త పోస్టులు జతచేస్తూ అనుబంధ

(మిగతా 9వ పేజీలో)

# నేడే గ్రూప్-2 నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 597 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో టీఎస్‌పీఎస్సీ దీనిపై అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేయబోతున్నది. ఈ అనుబంధ నోటిఫికేషన్‌కు మరో రెండు లక్షల ముప్పై వేల కొత్త దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు. మొత్తంమీద అభ్యర్థుల సంఖ్య ఏడున్నర లక్షలకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ప్రాథమికంగా సిద్ధమైందని తెలుస్తున్నది. పాత, కొత్త అభ్యర్థులకు కలిపి పరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ వర్గాలు జిల్లా కలెక్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నాయి. గత ఏప్రిల్‌లో అనుకొన్న సెంటర్లతోపాటు మరిన్ని కేంద్రాలను అదనంగా సిద్ధం చేయాలని కోరినట్టు సమాచారం.

## జిల్లాలవారీగా అభ్యర్థుల సంఖ్య

| జిల్లా పేరు | పాత దరఖాస్తులు | జిల్లా పరీక్షా నిర్వహణా సామర్థ్యం | కొత్తగా వచ్చే దరఖాస్తులు (అంచనా) |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 43243 | 44328 | 15000 |
| రంగారెడ్డి | 140767 | 127125 | 50000 |
| హైదరాబాద్ | 90766 | 89000 | 30000 |
| మెదక్ | 20879 | 33024 | 30000 |
| నిజామాబాద్ | 30069 | 33048 | 10000 |
| ఆదిలాబాద్ | 14890 | 17000 | 20000 |
| కరీంనగర్ | 69834 | 69695 | 20000 |
| వరంగల్ | 68368 | 76188 | 15000 |
| ఖమ్మం | 43774 | 47464 | 15000 |
| నల్లగొండ | 41841 | 33024 | 25000 |
| మొత్తం | 564431 | 569896 | 230000 |